క్లుప్తంగా

బీఎంఎస్‌లో చేరిక



బీఎంఎస్‌లో చేరిన అశోక్, ఈశ్వరచారి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌కు చెందిన పలువురు నాయకులు బీఎంఎస్‌లో చేరారు. ఐఎన్టీయూసీ నాయకుడు చాట్ల అశోక్‌తో పాటు మైనింగ్ సర్దార్ కే.ఈశ్వర చారీలు ఆదివారం కొత్తగూడెంలోని బీఎంఎస్ భవన్‌లో ఆ యూనియన్ వేజ్ బోర్డు సభ్యుడు మాధవ్‌నాయక్ సమక్షంలో యూనియన్‌లో చేరారు. వారికి ఆయన కండువా కప్పి యూనియన్‌లోకి స్వాగతం పలికారు. శ్రీరాంపూర్‌లో యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని వారికి సూచించారు. వీరిద్దరికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షులు జీవీ కృష్ణారెడ్డి, నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమావేశం

మంచిర్యాలటౌన్: భారత రాష్ట్ర సమితి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మంచిర్యాల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని సోమవారం మధ్యాహ్నం 12గంటలకు జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో గల పద్మనాయక ఫంక్షన్‌హాల్లో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

పాతమంచిర్యాల: శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన నిరాహార దీక్ష ఆదివారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడుతూ.. 14నెలల క్రితం పవర్‌ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపివేసి, ప్లాంట్ మూతవేసిన యాజమాన్యం తమకు రావాల్సిన వేతనాలు, ఇతర బకాయిలు చెల్లించడంలో కాలయాపన చేస్తుందన్నారు. యాజమాన్యం స్పందించి తమకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు.

చెక్కు అందజేత



రఘుపతి కుటుంబానికి చెక్కు ఇస్తున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

భీమారం: భీమారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బానోత్ రఘుపతి మృతి చెందగా, అతడికి పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఆదివారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ తన పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తుందన్నారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షులు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నాయకులు బుక్యా రాజ్‌కుమార్‌నాయక్, జలంపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అండగా నిలవాలి



ఎమ్మెల్యేతో ఉద్యమకారులు

మంచిర్యాలటౌన్: తెలంగాణ ఉద్యమకారులకు అండగా నిలవాలని కోరుతూ పలువురు ఉద్యమకారులు ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌లను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో 100రోజుల్లోపు తెలంగాణ ఉద్యమకారులకు 250గజాల స్థలాన్ని ఇస్తామని చెప్పారని, ఆ హామీని నెరవేర్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ గుండేటి ఐలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడ నారాయణ రెడ్డి, నగమల్ల ప్రకాశ్, పెద్దపల్లి సత్యనారాయణ, రామగిరి రాజన్న, లింగమూర్తి, సుధాకర్, దొడ్డె శంకర్, కర్రె లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

దాహం తీర్చని భగీరథ

- పనుల్లో నాణ్యత లోపం
- పైపులు కట్ చేసి వదిలేసిన కాంట్రాక్టర్లు
- ఆరేళ్లుగా నత్తనడకన పనులు

మున్సిపాలిటీలో జనాభా 23,527
18 వార్డులు
మొత్తం కనెక్షన్లు - 7629
పూర్తయిన కనెక్షన్లు - 5676
కెపాసిటీ 1510 మిల్లీలీటర్లు



పాత తహసీల్ కార్యాలయం ఎదుట కట్ చేసి వదిలేసిన మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్

చెన్నూర్: కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం చెన్నూర్ మున్సిపాలిటీ ప్రజలకు శాపంగా మారింది. తలాపునే గోదావరి ఉన్నా చేప నీటి కోసం వేతికినట్లు చందంగా మారింది ప్రజల తీరు. వేసవి కాలం ప్రారంభం కాకముందే మహిళలు, నీటి కోసం తిప్పలు పడుతున్నారు. శుద్ధ జలం అందిస్తామని చెప్పిన గత ప్రభుత్వం ఆరేళ్లెనా, నేటికీ చుక్క నీరు రాని కాలనీలు ఉన్నాయంటే నమ్మశక్యం కాదు. ఇప్పుడే తాగునీటి కష్టాలు ఉంటే రానున్న వేసవి కాలంలో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో చెప్పనక్కర లేదు.

ఆరేళ్లు నుంచి..

మహిళలు తాగునీటి కోసం బిందెలు పట్టుకొని బయటికి వెళ్లకుండా ఇంటింటికీ శుద్ధజలం అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2018లో మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా చెన్నూర్ మున్సిపాలిటీలో పనులు ప్రారంభమై ఆరేళ్లు కావస్తున్నా, నేటికీ భగీరథ నీరు మున్సిపాలిటీ పరిధి ప్రజలు దాహార్తి తీర్చలేని దుస్థితి నెలకొంది. కాంట్రాక్టర్లు కొన్ని ప్రాంతాల్లో పైపులైన్లు కట్ చేసి వదిలివేయడంతో, చెత్తా చెదారం నిండి పైపులు మూసుకొని పోయాయి.

మున్సిపాలిటీలో పూర్తికాని భగీరథ..

మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణవాడ, గంగపుత్ర కాలనీ, గోదావరిరోడ్డు, కాజీపూర, మహంకాళివాడ, శిశుమందిర్‌వాడ, లైన్‌గడ్డ, గెర్రెకాలనీలలో మిషన్ భగీరథ పనులు పూర్తి కాలేదు. పాత తహసీల్ కార్యాలయం వద్ద నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ కనెక్షన్లు ఇవ్వకపోడంతో పాత బస్టాండ్ ఏరియా ప్రాంతంలో నీటి సరఫరా కావడంలేదు. ఆయా కాలనీల ప్రజలు క్యాన్లు, బిందెలు పట్టుకొని తిరగాల్సిన దుస్థితి నెలకొంది.

నత్తనడకన సాగుతూ...

చెన్నూర్ మున్సిపాలిటీలో భగీరథ పనులు ఆరేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. చేపట్టిన పనుల్లో నాణ్యత లోపం కారణంగా మాటిమాటికి లీకేజులు అవుతున్నాయి. నేటికీ ప్రధాన పైపులైన్లు లీకేజీల మరమ్మతులు చేసిన ధాఖలాలులేవు. మున్సిపాలిటీ పరిధిలోని మరో 1953కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది.



పాత బస్టాండ్ ప్రాంతంలో డ్రెయినేజీ నుంచి వేసిన మెయిన్ పైపు

నీళ్లు రావడం లేదు..



రెండేళ్ల క్రితం ఇంటి ఎదుట నల్లా బిగించిండ్లు. ఇప్పటి వరకు నీరు సరఫరా చేయలేదు. శుద్ధ జలం వస్తుందని ఆశ పడ్డాం. రెండేళ్లుగా చుక్క నీరు రాలేదు. దాహార్తి తీర్చుకునేందుకు బోరు నీటిని తెచ్చుకొని వాడుతున్నాం. బోరు నీరు తాగేందుకు పనికి రావడం లేదు. బయటికి వెళ్లి తాగే నీరు తెచ్చుకుంటున్నాం.

– చిలువేరి గౌరి, శిశుమందిర్ కాలనీ, చెన్నూర్

పనులు పూర్తయ్యేలా చూస్తాం..

మున్సిపాలిటీ పరిధిలో కొన్ని కాలనీల్లో పనులు పూర్తి చేయాల్సి ఉన్న మాట వాస్తవం. ఈ వేసవి కాలం లోగా అన్ని ప్రాంతాల్లో కనెక్షన్లు పూర్తి చేసి తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తాం.

– సరిత, మిషన్‌భగీరథ, ఏఈ, చెన్నూర్

ఉర్సుకు ముస్తాబైన దర్గా

- సోమ, మంగళవారాలలో ఉత్సవాలు
- తొలి రోజు గంధం, రెండో రోజు ఉర్సు
- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు సిద్ధం



ముస్తాబైన దర్గా

చెన్నూర్: పట్టణంలోని పోస్టాఫీసు ఎదురుగా జమామసీదు పక్కన గల సయ్యద్ షా బాబా రెహెమ్మతుల్లా అలై ఉర్సు ఉత్సవాలకు దర్గాను ముస్తాబు చేశారు. సోమవారం గంధం, మంగళవారం ఉర్సు ఉత్సవాల కోసం దర్గాను ముస్తాబు చేసినట్లు ఉర్సు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నవాజ్ తెలిపారు. ఈ సందర్భంగా నవాజ్ మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా మతసమరస్యానికి ప్రతీకగా నిర్వహించే ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేదుకు, అన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. సోమవారం గంధంలో భాగంగా సాయంత్రం బాబా దర్గా నుంచి ఐబీ దర్గా వరకు శోభాయాత్ర నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏటా ఉర్సు ఉత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివస్తున్నారని, ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాటు చేశామన్నారు. రెండు రోజుల పాటు ఉత్సవాలలో ముంబాయికి చెందిన కళాకారులు హబీబ్ అజ్మీరీ, బేబీ వర్సీలు కవ్వాలీ నిర్వహిస్తారని తెలిపారు.

రైతు పక్షపాతి ప్రేమ్‌సాగర్‌రావు

- ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, రైతులు



క్షీరాభిషేకం చేస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్ తూముల వెంకటేశ్, రైతులు

మంచిర్యాలటౌన్: నియోజకవర్గ చరిత్రలోనే గింజ తరుగులేకుండా వడ్లు కొనుగోలు చేయించిన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు రైతు పక్షపాతి అని పీఏసీఎస్ డైరెక్టర్ తూముల వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో రైతులతో కలిసి పీఎస్సాఆర్ చిత్ర పటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం పద్మనాయక కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సుకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా మంచిర్యాల నియోజకవర్గంలో వడ్లు కొనుగోళ్లలో తాలు తప్పా, తరుగు లేకుండా చేసి రైతులకు పెద్ద మేలు చేసిన నాయకుడు పీఎస్సార్ అని అన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు తూముల వెంకట్రామయ్య, బొలిశెట్టి మల్లయ్య, నాగన్న, బొల్లం ఆశాలు, మల్లయ్య, జితేందర్, మాజీ కౌన్సిలర్ చింతకింది మల్లయ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, బొల్లం భీమయ్య, పుట్ట లావణ్య, వొడ్నాల శ్యామ్, పురెల్ల రాజన్న, దర్ని శ్రీనివాస్, ఎడ్ల మల్లేశ్, అంకం సతీశ్, ఆరె దేవేందర్, నలిగేటి కుమార్ యాదవ్, పెంట ప్రశాంత్, బొల్లం సతీశ్, అంజన్న, కొల్లూరి సతీశ్, భాస్కర్, సాయిరాం గౌడ్, నాగుల లలిత, పోచం, గజెల్లి రాయమల్లు పాల్గొన్నారు.

మోటివేషన్ కార్యక్రమాలు అభినందనీయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రకాశ్‌నాయక్ దంపతులు

జన్నారం: మోటివేషన్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు అనేక అంశాలను బోధించడం అభినందనీయం అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండలంలోని పొన్కల్ గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రకాశ్‌నాయక్ ఇంటికి ఆదివారం మర్యాద పూర్వకంగా రావడంతో, ఎమ్మెల్యేకు ప్రకాశ్‌నాయక్ దంపతులు సన్మానం చేశారు. విద్యార్థుల భవిష్యత్ కోసం వారి మనస్తత్వాన్ని మార్చడం కోసం మోటివేషన్ చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం మోటివేషన్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ప్రవీణ్‌కుమార్, కాంత, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల హామీతో కాంగ్రెస్ మోసం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరితమైన ఆరు గ్యారంటీ హామీలతో అధికారంలోకి వచ్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో 350కి పైగా స్థానాలను బీజేపీ గెలిచి మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశ ప్రజలందరూ బీజేపీవైపు ఉన్నారన్నారు. పేద ప్రజలు, మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో రజనీశ్‌జైన్, నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, దుర్గం అశోక్, గుండా ప్రభాకర్, రాపర్తి వెంకటేశ్వర్లు, పులగం తిరుపతి, రేకందర్ వాణి, మాసు రజిని, పట్టి వెంకటకృష్ణ, మాధవరపు రమణరావు, తోట మల్లికార్జున్, రాచర్ల సంతోష్, అక్కల రమేశ్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచులకు సన్మానం

కాసిపేట: మండలంలోని దేవాపూర్ మహిళా సమాఖ్య భవనంలో ఆదివారం తుడుందెబ్బ మండల కమిటీ ఆధ్వర్యంలో కాసిపేట మండలంలోని ఆదివాసీ మాజీ సర్పంచులకు సన్మానం చేశారు. ఆయా గ్రామపంచాయతీల సర్పంచులు ఆడె జంగు, పెంద్రం కవిత, పెంద్రం రాజు, కుడిమేత లక్ష్మిలను శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీలు ఐక్యతతో ముందుకు వెళ్తూ, హక్కుల సాధనలో ఉద్యమించాలని, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఐక్యత చాటాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ గౌరవాధ్యక్షులు ఆత్రం జంగు, అధ్యక్షుడు సంద్ర భూమయ్య, ఆదివాసీ విద్యార్థి సంఘం ప్రధానకార్యదర్శి వెడ్మ కిషన్, నాయక్‌పోడ్ సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్ముల బాపు, నాగేశ్వర్, సోయం సూరు, సిడం రాందాస్, కనక గోవర్ధన్, మడావి ధర్మరావు తదితరులు పాల్గొన్నారు.

ఊసేలేని గొర్రెల పంపిణీ..!

- డీడీలు కట్టి ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- 18నెలలు గడుస్తున్నా పట్టించుకోవట్లే..
- ఆందోళన చెందుతున్న అర్హులు



ప్రభుత్వం మంజూరు చేసిన గొర్రెలు (ఫైల్)

కోటపల్లి: జిల్లాలో గొర్రెల పంపిణీ అటకెక్కినట్లే ఉంది. ఇంత వరకు నత్తనడకన సాగిన పథకం ప్రస్తుతం దాదాపు ఆగిపోయింది. గొల్లకురుమల కుటుంబాలను లక్షాధికారులుగా మారుస్తామని గత ప్రభుత్వం చేపట్టిన పథక హామీ నీటిమూటగా మారింది. గొర్రెలకు మొదటి విడతలో అరకొరగా పంపిణీ చేసినా, రెండో విడత అసలు ఊసేలేదు.

మూడు వేలకుపైగా...

జిల్లాలో బీ జాబితాలో 2296మంది అర్హులున్నారు. ఇందులో 534మందికి గొర్రెలు పంపిణీ చేయగా 1790మంది లబ్ధిదారులకు గొర్రెలు అందక ఆందోళన చెందుతున్నారు. మొదటి ఫేజ్‌లో ఒక్కో యూనిట్‌కు పొట్టేలు, 20(గొర్రెలు) ధర రూ.1.25లక్షలుగా నిర్ణయించగా ఇందులో మొత్తం 75శాతం సబ్సిడీ పోగా 25శాతం లబ్ధిదారులు భరించాల్సి ఉంది. రెండో విడతలో యూనిట్ ధరను ప్రభుత్వం రూ.1.75లక్షలకు పెంచారు. ఇందులో లబ్ధిదారులు తమ వాటాగా రూ.43750కట్టాల్సి ఉంటుంది. జిల్లాలో రెండో విడత కోసం 2296 మంది డీడీలు కట్టగా 1790మందికి గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉంది.

ఏడాదిన్నరవుతున్నా....

డీడీలు కట్టి 18 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు గొర్రెల పంపిణీ చేపట్టలేదు. 2296 మందిలో 534 మందికే గొర్రెలు గ్రౌండింగ్ చేసి పంపిణీ చేశారు. మిగిలిన వారికి ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. కనీసం తాము చెల్లించిన డబ్బులైనా తిరిగి ఇవ్వాలని గొల్లకురుమలు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు అదిగో.. ఇదిగో అని కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వం మారిపోవడంతో పథకం ఆగిపోయినట్లేనా అని ఆందోళన చెందుతున్నారు. తాము చెల్లించిన డీడీలు పరిస్థితేమిటంటున్నారు. డీడీ కోసం వడ్డీలకు అప్పులు తెచ్చామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంపిణీ చేయాలి...



బీ జాబితాలో ఉన్న లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ చేయాలి. ఎంతో మంది పేద కాపర్లు గొర్రెల కోసం ఎదురు చూస్తున్నారు. డీడీ కట్టిన వారికి త్వరగా అందజేయాలి. ప్రభుత్వ నిర్ణయం మేరకే పెంపకందారులు దరఖాస్తు చేసుకున్నారు.

– మధుకర్, తెలంగాణ రాష్ట్ర గొర్రెలమేకల వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు

యూనిట్లు ఇవ్వలేదు...



మాకు అప్పట్లో యూనిట్లు మంజూరైందని చెప్పారు. డీడీ కట్టమంటే కట్టాను. కట్టి కూడా ఏడాది దాటింది. గొర్రెలు మాత్రం రాలేదు. కొంతమందికి గొర్రెలు ఇచ్చారు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా లాభం లేదు. మా డబ్బులు మాకు తిరిగి ఇచ్చిన పర్వాలేదు.

– రాజు, లబ్ధిదారుడు

లేఖలు రాశాం...

ప్రభుత్వ నిర్ణయం మేరకు గొర్రెల పంపిణీ నిలిపివేశాం. లబ్ధిదారులు చెల్లించిన డీడీలకు సంబంధించిన డబ్బులు ప్రభుత్వం జిల్లా కలెక్టర్ల ఖాతాలో వేసింది. ప్రభుత్వం మారినందునా ఆలస్యం అవుతుంది. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులకు లేఖలు రాశాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వెంటనే గొర్రెలు పంపిణీ చేస్తాం. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– రమేశ్, జిల్లా పశువైద్యాధికారి

ఎదురుచూపులకు తెర..!

- నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా వంతెన, రోడ్డు పనులు ప్రారంభం



వంతెన నిర్మాణ పనుల వద్ద ఎంపీటీసీ, అధికారులు

వేమనపల్లి: దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న చామనపల్లి, బద్దంపల్లి, బొమ్మెన, కుశ్నపల్లి గ్రామస్తుల ఎదురుచూపులకు తెరపడనుంది. సోమవారం ఎమ్మెల్యే వినోద్ చేతుల మీదుగా రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి. ఎంపీటీసీ సంతోష్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, పంచాయతీరాజ్ అధికారులు రోడ్డు పనులు ప్రారంభించే పనుల్లో నిమజ్ఞమయ్యారు. రెండు వంతెనలు, రోడ్డు నిర్మాణంతో పక్కన ఉన్న కుమురంభీం జిల్లాతో పాటు కోటపల్లి, వేమనపల్లి, నెన్నెల, దహెగాం, భీమిని మండలాలకు దూర భారం తగ్గనుంది.

నిధులు మంజూరైనా పనులు జరగలేదు..

చామనపల్లి వాగుపై వంతెన రోడ్ల నిర్మాణానికి గత ఐదేళ్ల క్రితమే నిధులు మంజూరయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రత్యేక చొరవ చూపి చామనపల్లి వాగుపై రోడ్లు, వంతెనల నిర్మాణానికి రూ.8కోట్ల 24లక్షలు, సూరారం, బద్దంపల్లి వరకు రూ.7 కోట్ల 7లక్షలు, బొమ్మెన ఒర్రెపై వంతెన నిర్మాణానికి రూ.కోటి 25లక్షలు, చామనపల్లి వాగు నుంచి గ్రామం వరకు రూ.1కోటి 40లక్షలు, చామనపల్లి గ్రామం నుంచి కుశ్నపల్లి రోడ్డు వరకు రూ.1 కోటి 90లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ ఈ రోడ్డు నిర్మాణానికి పెద్ద మొత్తంలో అటవీ మార్గం గుండా పోతుండటంతో అటవీ శాఖ అడ్డంకిగా మారింది. ఐదేళ్లుగా పనులు పూర్తి చేయలేదు. ప్రారంభ దశలోనే ఉన్నాయి. కనీసం గత పాలకులు అటవీ శాఖ క్లియరెన్స్, పనులు పూర్తి చేయడంలో పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఆ హామీ ప్రకారం పనుల ప్రారంభానికి శ్రద్ధ వహించారు. ఇటీవల అటవీ శాఖ నుంచి క్లియరెన్స్ రావడంతో పనులు ముమ్మరం చేశారు. కాంట్రాక్టర్లు, పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడి సోమవారం పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నటీనటుల ఎంపికకు స్పందన

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పకోడ హబ్ బిల్డింగ్‌లో ఆదివారం నిర్వహించిన నటీనటుల ఆడిషన్స్‌కు స్పందన లభించినట్లు రుద్రనేత్రి సినిమా ఫేమ్ తిరుపతి కే వర్మ అన్నారు. మరోసారి శ్రీ లక్ష్మీ నర్సింహా ఆర్ట్స్, మంచిర్యాల క్రియేటివ్ వర్క్స్ నిర్మిస్తున్న మరో కొత్త సినిమా నిర్మాణానికి నూతన నటీ నటుల ఎంపికకు ఆడిషన్స్ నిర్వహించినట్లు డైరెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించగా సుమారు 150మందికి పైగా ఆర్టిస్టులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ప్రొడ్యూసర్లు తోట మహేష్, సీహెచ్ దినపతి రెడ్డి, కృపాదానం, రాజన్న, ఫిరోజ్‌ఖాన్, కెమెరామెన్ విజయ్‌కుమార్, దుర్గం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కోటపల్లి: జనగామ గ్రామానికి చెందిన చెన్నూరి పోచం ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోయి నిరాశ్రయుడు అయ్యాడు. కాగా బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామపెద్దలు రూ.19వేలు ఆర్థిక సాయం అందించారు.